

ఆగని.. ఆత్మహత్యలు..!

రాష్ట్రంలో కొనసాగుతున్న కాంట్రాక్టర్లు, అధికారుల బలవన్మరణాలు
కమీషన్ల కోసం ఆగని నేతల వేధింపులు
నాడు బీజేపీ పాలనలో... నేడు కాంగ్రెస్ హయాంలో...
బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన, నిజనిర్ధారణ కమిటీలు

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన రెండు ప్రభుత్వాల పరిధిలో కాంట్రాక్టర్లు, అధికారుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని మంత్రుల మెడలకు చుట్టుకున్నాయి. కేసుల తర్వాత వారు బయటపడినా కాంట్రాక్టర్‌ల కుటుంబాలు మాత్రం రోడ్డున పడ్డాయి. కమీషన్‌ల డిమాండ్ పెరగడం, సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడం వంటి కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022 బీజేపీ పాలనలో ఇద్దరు కాంట్రాకర్లు ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే పరంపర కొనసాగుతోంది. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ఇద్దరు కాంట్రాక్టర్లతో పాటు ఇద్దరు అధికారులు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు అదే తరహాలోనే మృత్యువాత చెందారు. బీజేపీ పాలనలో అప్పటి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఈశ్వరప్ప కమీషన్‌లకు డిమాండ్ చేశారని డెత్‌నోట్‌లో రాసి కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ 2022 ఏప్రిల్ 11న ఉడుపిలోని ఓ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఈశ్వరప్ప మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇక తుమకూరుకు చెందిన పీఎస్ ప్రసాద్ అనే కాంట్రాక్టర్ కమీషన్ల డిమాండ్, బిల్లు చెల్లింపులలో జాప్యం వంటి కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇదే పరంపర కొనసాగుతోంది. కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలిలో బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని దావణగెరెకు చెందిన కాంట్రాక్టర్ బీ ప్రసన్న సంతెబెన్నూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. డెత్‌నోట్‌లో అధికారుల అవినీతిని ప్రస్తావించారు. తాజాగా గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ప్రియాంకఖర్గే అప్తుడు రాజు కపనూరు టెండరు ద్వారా పనులు ఇప్పిస్తానంటూ నగదు తీసుకుని మోసం చేశారని బీదర్ జిల్లా భాల్కి తాలూకా యువకాంట్రాక్టర్ సచిన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సచిన్ 7 పేజీల డెత్‌నోట్‌ను రాసిపెట్టారు. ఈ వివాదంపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడుతోంది. మంత్రి ప్రియాంకఖర్గే రాజీనామాకు డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేయాలని డిమాండ్ చేపట్టింది. ఇక రాష్ట్రంలో సంచలనం కల్గించిన మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ శివమొగ్గలోని వినోభానగర్‌లో మే 26న ఆత్మహత్య చేసుకున్నారు. ఇతను డెత్‌నోట్‌లో కార్పొరేషన్ ఎండీతో పాటు అకౌంటెంట్‌ల వేధింపులను ప్రస్తావించారు. ఈ వివాదంలోనే మంత్రి నాగేంద్ర పదవికి రాజీనామా చేశారు. సిట్ దర్యాప్తులో నాగేంద్రకు క్లీన్‌చిట్ ఇచ్చినా ఈడీ దర్యాప్తులో అసలు సూత్రధారి నాగేంద్ర అంటూ చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. రాష్ట్ర బోవి కార్పొరేషన్‌కు వస్తువులు సమకూర్చిన పారిశ్రామికవేత్త జీవా ఆత్మహత్య చేసుకున్నారు. ఈమె అధికారులతోపాటు సీఐడీ డీఎస్పీ వేధింపులపై 11 పేజీల డెత్‌నోట్ రాశారు. బెళగావి తహసీల్దారు కార్యాలయంలో ద్వితీయశ్రేణి ఉద్యోగి రుద్రణ్ణ ఎడవణ్ణవర్ కార్యాలయంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఆప్తులతోపాటు ముగ్గురు కారణమని అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. కాగా యాదగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే చెన్నారెడ్డి పాటిల్ కుమారుడు వేధిస్తున్నారని యాదగిరి ఇన్‌స్పెక్టర్ 2024 ఆగస్టు 3న ఆత్మహత్య చేసుకున్నాడు. బదిలీ కోసం భారీగా డిమాండ్ చేశారని డెత్‌నోట్‌లో రాసుకున్నారు. ఇదే ఏడాది రామనగర జిల్లా కగ్గలిపుర సీసీబీ ఇన్‌స్పెక్టర్ తిమ్మేగౌడ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అధికారుల వేధింపులే కారణమని కుటుంబీకులు ఆరోపించారు. ఇలా కాంగ్రెస్ పాలనలో అధికారులు, కాంట్రాకర్లు పోలీసు అధికారులు సైతం ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటన పరంపర కొనసాగుతోంది.

ఆందోళన కమిటీల ఏర్పాటు

రాష్ట్రంలో వరుస ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బీజేపీ నేతృత్వంలో ఆందోళన కమిటీలను ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ సభ్యులను కమిటీలో చేర్చింది. పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణ స్వామి, మాజీ హోం మంత్రి ఆరగ జ్ఞానేంద్ర, ఎమ్మెల్యేలు అశ్వత్థనారాయణ, బసవరాజ్ మత్తిమూడ్, ఎమ్మెల్సీలు రవికుమార్, నవీన్, భారతిశెట్టి, హేమలతనాయక్‌తో పాటు 17మంది సభ్యులను నియమించారు. పార్టీ ఆందోళన కమిటీల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నారు. మరోవైపు నిజనిర్ధారణ కమిటీలో డాక్టర్లుగా ఉండే ఎమ్మెల్యేలు శైలేంద్ర బెల్దాళె, చంద్రు లమాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజ్ కేలగారతోపాటు 13మంది సభ్యులు నియమించారు. ఆత్మహత్యకు పాల్పడిన కాంట్రాక్టర్లు, అధికారుల కుటుంబీకులను పరామర్శించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోదలిచారు. ఎవరి వేధింపులు ఉన్నాయనేది వారు అవగాహన పొంది పార్టీ రాష్ట్ర కమిటీకి నివేదిక సమర్పించనున్నారు.

అధికారి వేధింపులతోనే..!

కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ అధికారి చేతిలో డెత్‌నోట్ పట్టుకునే ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బెంగళూరు నగరం మహాలక్ష్మి లే అవుట్‌లో చోటు చేసుకుంది. కెఎస్‌డీఎల్‌లో మెటీరియల్ విభాగంలో పనిచేసే అధికారి అమృత్ సిరియూర్ (40) మహాలక్ష్మి లే అవుట్‌లోని ఇంట్లో ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇతడు రాసుకున్న డెత్‌నోట్‌లో సీనియర్ అధికారుల వేధింపులతో పాటు పని ఒత్తిడి కారణంగా ఉన్నట్లు సమాచారం. మహాలక్ష్మి లేఅవుట్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అతిక్రమిస్తే చర్యలు..

- నూతన సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- రాత్రి ఒంటిగంట వరకే అనుమతులు
- బందోబస్తుకు 11 వేలమంది పోలీసులు
- హోం మంత్రి పరమేశ్వర్



బెంగళూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో అతిగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హోం మంత్రి పరమేశ్వర్ హెచ్చరించారు. బెంగళూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా ఎటువంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోనున్నారన్నారు. 11,830 మంది సిబ్బందిని బందోబస్తుకు కేటాయించామన్నారు. వీరిలో సీనియర్ అధికారులతోపాటు సివిల్ డిఫెన్స్, పోలీసు సిబ్బంది ఉన్నారన్నారు. కేవలం నగరంలోనే కాకుండా రాష్ట్రమంతటా ఎక్కడా హింసకు దారి తీయకూడదని జిల్లా ఎస్పీలకు సూచించామన్నారు. కాగా నగరంలో డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించడం ఓ వేడుకగా ఉండాలని, వేధింపులకు, హింసకు కారణం కారాదన్నారు. శాంతిభద్రతలు కాపాడడంలో రాజీ ఉండదన్నారు. నగర పరిధిలో వెయ్యికిపైగా కెమెరాలను అమరుస్తున్నామన్నారు. ప్రజలు అతిగా ప్రవర్తించరాదన్నారు. అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రమే అనుమతులు ఉంటాయని ఆ తర్వాత వేడుకలు, ఊరేగింపులు జరపరాదన్నారు. అతిగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, ఇందిరానగర్, కోరమంగల ప్రాంతాలలో నూతన సంవత్సర వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లు, పబ్‌లు విద్యుద్దీపాలతో అలంకరించారు. మరోవైపు స్టార్ హోటళ్లలో ప్యాకేజ్‌ల పద్ధతిన వేడుకలకు ఆహ్వానించారు. సాధారణ నుంచి ఫైవ్‌స్టార్, 7స్టార్ హోటళ్లలో భారీగా ప్యాకేజీలు ప్రకటించారు. ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్లలో వారం రోజులుగా కొత్త ఉత్సాహం సాగుతోంది.

నంది హిల్స్ ప్రవేశంపై ఆంక్షలు

చిక్కబళ్ళాపురానికి అనుబంధంగా ఉండే నంది హిల్స్‌లో మంగళవారం సాయంత్రం 6 గంటలనుంచి జనవరి 1న బుధవారం ఉదయం 7 గంటల వరకు ప్రవేశం నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. రాత్రివేళ నందిహిల్స్ ప్రాంతానికి ఎవరూ రాకూడదని సూచించారు. నందికొండలపై గెస్ట్‌హౌస్ బుకింగ్ రద్దు చేసినట్లు జిల్లా అధికారి రవీంద్ర తెలిపారు. నందికొండల చుట్టూ 150మంది పోలీసులను బందోబస్తుకు కేటాయించారు. అదే తరహాలోనే మండ్య, మైసూరుతోపాటు వివిధ పర్యాటక కేంద్రాలలో ఆంక్షలు ఉంటాయన్నారు.



నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

డీసీఎం, మంత్రి చట్టాన్ని ఉల్లంఘించారు

- సువర్ణసౌధలో దాడిపై గవర్నర్‌కు బీజేపీ నేతల ఫిర్యాదు
- ప్రియాంక ఖర్గే రాజీనామాకు డిమాండ్

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సువర్ణసౌధ ప్రాంగణంలోనే ఎమ్మెల్సీ సీటీ రవిపై దాడి, అరెస్టుపై నిజనిర్ధారణ జరపాలని డీసీఎం డీకే శివకుమార్, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మార్గదర్శకంతో రాజ్యాంగ, చట్ట ఉల్లంఘనకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌ను కోరారు. బీజేపీ రాష్ట్ర కమిటీ సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి సమగ్రంగా వివరాలు తెలిపారు. పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి నేతృత్వంలో పరిషత్ సభ్యులు సీటీ రవి, రవికుమార్, కేశవప్రసాద్‌తోపాటు పలువురు గవర్నర్‌ను కలసిన బృందంలో ఉన్నారు. దౌర్జన్యంగా వ్యవహరించిన అల్లరి మూకలు సువర్ణసౌధలోకి ఎలా ప్రవేశించారనేది పరిశీలించాలన్నారు. ఏకంగా దాడి చేయడమే కాక రాత్రంతా పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిప్పారని, క్వారీల వద్దకు తీసుకెళ్లారని, పోలీసులు ఎవరో మార్గదర్శకంలో పనిచేసినట్లు ఉందని ఆరోపించారు. సమగ్ర పరిశీలనలు జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఈమేరకు రాష్ట్రపతికి వినతిని పంపనున్నట్లు ఛలవాది నారాయణస్వామి తెలిపారు. రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ బీదర్‌కు చెందిన కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడని అందుకు మంత్రి ప్రియాంక ఖర్గే అనుచరుడే కారణమని డెత్‌నోట్‌లో ఉన్నా కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, చట్టాన్ని ఉల్లంఘించారని ఆరోపించారు. అయితే ఇదే విషయమై మంత్రి ప్రియాంక ఖర్గే స్పందిస్తూ వారు ఎన్ని ఎత్తుగడలు వేసినా రాజీనామా ప్రసక్తే లేదన్నారు. బీజేపీ నాయకులు తనను టార్గెట్ చేశారన్నారు. యడియూరప్ప పాలనలో రౌడీలు, నేరస్తులతో ఉండే ఫొటోలు విడుదల చేయాలా అంటూ మండిపడ్డారు. ఈ వివాదాన్ని సీఐడీ ద్వారా దర్యాప్తు జరిపించాలని సీఎంకు లేఖ రాసినట్లు తెలిపారు. కాగా డీసీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ కాంట్రాక్టర్ ఆత్మహత్యకు మంత్రి ప్రియాంకఖర్గేకు ఏం సంబంధమని కొట్టిపారేశారు. ఆయన రాజీనామా చేయాల్సిన అవసరం లేదన్నారు. కాంట్రాక్టర్ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తీవ్రంగా స్పందించారు. బీదర్‌కు చెందిన కాంట్రాక్టర్ సచిన్ పాంచాళ్ హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి ప్రియాంక ఖర్గే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకేసును జనవరి 4లోగా సీబీఐకు అప్పగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతల బృందం

పాతిక లక్షలిస్తే పాస్ చేయిస్తా..!

- పోటీ పరీక్షల్లో పాస్ చేయిస్తానంటూ మోసం
- రైల్వే టీసీని అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వివిధశాఖల ఉద్యోగాల భర్తీకై నిర్వహించే పోటీ పరీక్షల్లో పాస్ చేయిస్తానంటూ అభ్యర్థులనుంచి భారీగా మోసం చేసిన కేసులో రైల్వే టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు ను అరెస్టు చేశారు. గోవిందరాజు మెజస్టిక్‌లో రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల జరిగిన పోటీ పరీక్షల్లో పీడీఓ పోస్టుకు రూ.25లక్షలు, కేఏఎస్ ప్రిలిమ్స్ పరీక్షకు రూ.50లక్షల చొప్పున ఇవ్వాలని కొందరితో ఒప్పందం చేసుకున్నారు. పరీక్షల్లో సమాధానం తెలియని ప్రశ్నలకు ఖాళీ ఉంచాలని సూచించారు. వాటిని తాను భర్తీ చేసుకుంటానని పలువురిని నమ్మించారు. ఆదివారం జరిగిన కేఏఎస్ ప్రిలిమ్స్ పరీక్షల్లో పాస్ చేయిస్తానంటూ ఓ అభ్యర్థిని కలిసేందుకు విజయనగర్‌కు వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు.

దర్శన్ గ్యాంగ్‌కు సర్కార్ షాక్

- సుప్రీంకోర్టులో పిటిషన్‌కు అనుమతి

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో నటుడు దర్శన్‌తోపాటు ఇతర నిందితులకు సర్కార్ షాక్ ఇచ్చింది. ఏ2 నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్ మెడికల్ గ్రౌండ్స్‌లో తొలుత బెయిల్ పొందారు. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ దక్కడంతో ప్రశాంతంగా బయటపడినట్లయ్యింది. నెలన్నరకాలంగా ఆసుపత్రిలో గడిపిన దర్శన్ రెగ్యులర్ బెయిల్ రావడంతో డిశ్చార్జ్ అయ్యారు. కోర్టు అనుమతులు పొంది మైసూరులోని ఫాం హౌస్‌లో గడుపుతున్నారు. హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసుశాఖకు అనుమతి ఇచ్చింది. ఈమేరకు పోలీసుశాఖ న్యాయవాదులు అనిల్ సినిశాని, సిద్దార్థ లూథ్రాను నియమించింది. మరో రెండు రోజుల్లో పిటిషన్ దాఖలు చేయనున్నారు. దీంతో దర్శన్‌తోపాటు నిందితులందరికీ షాక్ ఇచ్చినట్లు అయింది.

ఐశ్వర్యగౌడపై చర్యలు తీసుకోండి

- పోలీస్ కమిషనర్‌కు డీకే సురేశ్ లేఖ

బెంగళూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తన పేరు వాడుకుంటూ మోసాలకు పాల్పడిన ఐశ్వర్యగౌడ అలియాస్ నవ్యశ్రీపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ డీకే సురేశ్, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ దయానంద్‌కు లేఖ రాశారు. సదరు లేఖను మీడియాకు సోమవారం విడుదల చేశారు. తన పేరు వాడుకుని పలువురి నుంచి బంగారం, నగదు తీసుకుని మోసం చేసిన అంశం మీడియా ద్వారా తెలిసిందని లేఖలో పేర్కొన్నారు. అలా మోసాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని భవిష్యత్తులో సామాన్య ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

2 వరకు సీఎం విశ్రాంతి

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా ఎడతెరిపి లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చిన సీఎం సిద్దరామయ్య నాలుగు రోజుల విశ్రాంతికి వెళ్లారు. ఆదివారం నుంచి జనవరి 2వరకు ఎటువంటి షెడ్యూల్ ఉండవని సీఎంఓ ప్రకటించింది. బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు, ఆ తర్వాత బెళగావిలో కాంగ్రెస్ శతాబ్ధి ఉత్సవాలు ముగియక ముందే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ఢిల్లీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. సంతాపదినాల కారణంగా అధికారిక కార్యక్రమాలు రద్దు చేశారు.

ఉమ్మడి జిల్లాలో రోడ్ల పరిస్థితి ఇలా...

- కూటమి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు మంజూరు చేసిన నిధులు - రూ.44.29 కోట్లు
- గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు: రూ. 75 కోట్లు
- విపత్తుల సమయంలో రోడ్ల మరమ్మతులకు గత సర్కార్ రూ. 139 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ. 8.26 కోట్లు ఇచ్చింది.

పీఆర్ పరంగా...

- కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారులకు మంజూరు చేసిన నిధులు : రూ. 203 కోట్లు
- గత టీడీపీ హయాంలో పీఆర్‌లోని పీఐయూ విభాగంగా పరంగా 2018-19లో కేంద్రం సహకారంతో రూ. 268 కోట్లు విడుదల చేసింది.
- గత ఐదేళ్ల వ్యవధిలో గ్రామీణ రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 316 కోట్లు.
- విపత్తుల సమయంలో రూ. 77 కోట్లు పెడితే రూ. 45 కోట్లు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల నుంచి విడుదల చేసి మమ అనిపించింది.


తాడిపత్రి నుంచి బుక్కాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి వేయక ముందు.. వేసిన తరువాత..

పనులకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.44.29 కోట్లతో 253 పనులు 3438.36 కిలోమీటర్ల మేర చేయాలని ఆదేశించింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీలో చేసిన అరకొర పనులకు రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం గత సర్కార్ మాదిరిగా కక్ష సాధింపునకు దిగకుండా పెండింగ్ బిల్లులపై ఆరా తీయడంతో బాధిత కాంట్రాక్టర్లలో కొత్త ఆశలు రేకెత్తాయి. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా కొన్ని బ్రిడ్జిల పనులకు కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది.

పీఆర్ పరంగా...

ఉమ్మడి జిల్లా పంచాయతీ పరిధిలోని గ్రామీణ రహదారులను గత వైసీపీ సర్కార్ ఐదేళ్లలో పట్టించుకోలేదు. తద్వారా పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్ల పాలనలో రెండు సార్లు మాత్రమే నిధులు మంజూరు చేశారు. అంతకు మించి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల వ్యవధిలోనే అనంతపురం జిల్లాకు రూ. 100 కోట్లు, శ్రీ సత్య సాయి జిల్లాకు రూ. 103 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా జిల్లాల అధికారులతో పాటు కాంట్రాక్టర్లు, ప్రజల్లో ఆనందం పెరిగింది.

దారిద్ర్యం వదులుతోంది..!


పీఆర్‌లో పల్లెపండుగలో భాగంగా అనంతపురం శివారు రాజీవ్‌కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

వైసీపీ పాలనలో రోడ్లపై ప్రయాణం దుర్భరంగా ఉండేది. ఐదేళ్లలో ఒక్క కొత్త రోడ్డు వేయకపోగా ఉన్న రోడ్లకు సైతం మరమ్మతులు చేయలేదు. దీంతో రోడ్లపై గుంతలు ఏర్పడి గోతులుగా మారాయి. వీటిపై ప్రయాణించడానికి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. గుంతల రోడ్లపై ప్రయాణంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎంతో మంది గాయపడ్డారు. కొందరు మృతి చెందారు. అయినా అప్పటి ప్రభుత్వంలో రోడ్లను బాగు చేయాలన్న స్పృహ ఏమాత్రం కానరాలేదు. ఏదో అక్కడక్కడ తూతూ మంత్రంగా రోడ్లను సరి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి పాడైపోయిన రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈక్రమంలోనే పీఆర్, ఆర్‌అండ్‌బీ రోడ్లను బాగు చేయడానికి కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ నిధులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల బీటీ, సీసీ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఐదేళ్ల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే తొలగిస్తోందని వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల గురించి కూటమి ప్రభుత్వం ఆరా తీయడంతో కాంట్రాక్టర్లు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి సర్కారు రాకతో రోడ్ల పనులకు గ్రీన్‌సిగ్నల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా రహదారుల పనులు

కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

వైసీపీ పాలనలో ఛిద్రమైన రోడ్లు

అరకొర పనులకు బిల్లుల చెల్లింపులోనూ జాప్యమే


బుక్కరాయసముద్రంలో జరుగుతున్న రోడ్డ పనులు

కొత్త రోడ్లతో సందడి

కూటమి ప్రభుత్వం ఆయా శాఖల పరంగా నిధులు మంజూరు చేసి రోడ్ల పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఉమ్మడి జిల్లాలో కొత్త రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఆరు నెలల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం మరమ్మతులు, రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరు చేయడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పెండింగ్ బిల్లులపై ఆరా తీసి, నిధులన్నీ ఖర్చు చేసి ఆయా రోడ్లను సైతం వచ్చే సంక్రాంతిలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. కూటమి సర్కార్ రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ చూపిస్తుండటంతో అధికారులతో పాటు కాంట్రాక్టర్లు, ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.


ధర్మవరం పరిధిలో జరగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీరాములు

అనంతపురం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లు ఛిద్రమయ్యాయి. రోడ్ల అభివృద్ధి గురించి గానీ కనీసం మరమ్మతుల గురించి గానీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చే నిధులను సైతం గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని (పీఆర్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖలకు చెందిన) రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఆరునెలల కిందట కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఆయా శాఖల పరంగా నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్ల పనుల సందడి మొదలైంది. ప్రధానంగా పీఆర్ పరంగా చూస్తే.. పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ. 203 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్ల పనులకు నిధులు మంజూరు ఆవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాంట్రాక్టర్లలో సందడి మొదలైంది.

ప్రస్తుతం

- అనంతపురం జిల్లాలో ఆర్‌అండ్‌బీ పనుల పరిస్థితి.
- రోడ్ల పనుల సంఖ్య : 134
- పనులు చేయాల్సిన కిలోమీటర్లు : 1939.12
- కూటమి ప్రభుత్వం వెచ్చించిన నిధులు : రూ. 27.76 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఆర్‌అండ్‌బీ పనుల పరిస్థితి..
- రోడ్ల పనుల సంఖ్య : 119
- పనులు చేయాల్సిన కిలోమీటర్లు : 1499.24

- కూటమి ప్రభుత్వం వెచ్చించిన నిధులు : రూ.16.53 కోట్లు
- అనంతపురం జిల్లాలో పీఆర్ పనుల పరిస్థితి..
- రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 100 కోట్లు
- పనులు చేయాల్సిన రోడ్ల సంఖ్య : 1818

శ్రీ సత్యసాయి జిల్లాలో...

- రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 103 కోట్లు
- పనులు చేయాల్సిన రోడ్ల సంఖ్య : 1722



మడకశిర నియోజకవర్గంలోని భక్తరహళ్లి రోడ్డు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు


రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. రామ్‌నగర్‌లోని అనంతేశ్వర స్కేటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న హృత్విక్‌రెడ్డి రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. రాణ్యాతార, విశుత్, అవిరామ్, సహస్ర, కౌశిక్, విగ్నేష్, యోగినాథ్, ప్రతీష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డిలు ఆయా విభాగాల్లో పతకాలు సాధించారు. కోచ్ కేదార్‌నాథ్‌తో పాటు విజేతలకు పలువురు అభినందనలు తెలిపారు.

కాంక్రీట్ పనులపై రైతుల ఆందోళన

సీపీఐ నాయకుడు జగదీష్


ఇన్‌చార్జ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న జగదీష్

అనంతపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా రెండోదశ కాలువకు కాంక్రీట్ వేసే పనులపై రైతుల్లో ఆందోళన నెలకొందని, దీనిపై పునరాలోచించాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు జగదీష్ ఇన్‌చార్జ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల వేదికలో రైతులు, రైతు సంఘాల నేతలతో కలిసి ఆయన ఇన్‌చార్జ్ కలెక్టరును కలిశారు. ఈసందర్భంగా జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలో కృష్ణాజలాలు ప్రవహిస్తుండటంవల్ల లక్షలాది ఎకరాలకు నీరు అందుతోందన్నారు. భూగర్భజలాలు పెరిగి బోరుబావులు రీచార్జ్ అవుతుండటంతో రైతులు పంటలు పండించుకుంటున్నారన్నారు. ఇపుడు కాలువకు ఇరువైపుల, అడుగు ఘాతంలో కాంక్రీట్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. దీనివల్ల భూగర్భజలాలు పెరగక బోరు బావులు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అందుకే ఈకాంక్రీట్ పనులపై తొలుత రైతులు, రైతుసంఘాల నేతలు, అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

నియామకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 30: ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న సారయ్య అవినీతి, అక్రమాల నేపథ్యంలో సస్పెండ్ అయిన విషయం విదితమే. దీంతో ఆయన స్థానంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణకు ఇన్‌చార్జ్ ఈడీ బాధ్యతలు అప్పగించారు. నేడో రేపో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చంద్రబాబుతోనే నదుల అనుసంధానం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం/రాయదుర్గం, డిసెంబరు 30: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన నదులను అనుసంధానించడం చంద్రబాబుకే సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకొని రాయలసీమను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు తపిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగానే గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం జరగబోతోందన్నారు. ఎప్పటి నుంచో ప్రతిపాదనల్లోనే ఉండిపోయిన నదుల అనుసంధాన ప్రక్రియ సీఎం చంద్రబాబు చొరవతో కార్యరూపం దాల్చబోతుండటం హర్షణీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద తన ప్రత్యేక పలుకుబడిని విశాల ప్రజాప్రయోజనాలకు ఉపయోగిస్తున్న తీరు రాష్ట్ర భవిష్యత్తుపై చంద్రబాబుకున్న బాధ్యతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. సీమ జిల్లాల్లో ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే సీఎం ఆలోచనకు నిదర్శనమే ఈ నదుల అనుసంధానమన్నారు. వరద సమయంలో గోదావరి నుంచి రోజుకు రెండు మూడు టీఎంసీల నీటిని మళ్లించడం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. సుమారు రూ.80 వేల కోట్ల వ్యయంతో చేపట్టబోయే ప్రాజెక్టును రాబోయే మూడు నెలల్లో ప్రారంభానికి ప్రయత్నిస్తుండటం ప్రశంసనీయమన్నారు. గోదావరి జలాలతో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరందించడం సాధ్యపడుతుందన్నారు. పోలవరం ద్వారా కృష్ణా నదికి గోదావరి జలాలు మళ్లించడంతో పాటు అక్కడి నుంచి బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీరు మళ్లిస్తారని చంద్రబాబు చెప్పారన్నారు. తద్వారా 345 టీఎంసీల నీరు ఉపయోగించుకునే అవకాశం లభిస్తుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను సీమ జిల్లాలకు ఎక్కువ శాతం ఉపయోగించే వీలు కల్పించే ఈ బృహత్తర పథకంతో సీమ భవిష్యత్తు పూర్తిగా మారిపోతుందన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగరి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని కాలవ అన్నారు.

సొంతిల్లు కలే..!

● జగనన్న కాలనీల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

గోడలు, పునాదులకే పరిమితం

బిల్లులు అందక ఆపేసిన లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు


రేగాటిపల్లి సమీపంలో జగనన్నకాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ధర్మవరం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జగనన్న కాలనీల పేరుతో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పునాదులు, గోడలకే పరిమితమయ్యాయి. నిర్మాణ వ్యయం బాగా పెరిగిపోవడం, కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు ఆగిపోయినట్లు సమాచారం. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రభుత్వం అందించే రూ.1.8లక్షల సాయం ఎంత మాత్రం సరిపడలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం పట్టణ, మండల పరిధిలోని రేగాటిపల్లి, గొట్లూరు, పోతులనాగేపల్లి, కుణుతూరు, గొల్లపల్లి వంక సమీపాల్లో జగనన్న కాలనీ పేరుతో పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభింపజేశారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు సకాలంలో అందకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఆర్థిక స్తోమతలేక నిర్మాణాలు ఆపేశారు. ఇళ్లు కట్టుకోకపోతే పట్టాలు రద్దు అవుతాయోమోనన్న ఆందోళనతో కొందరు డబ్బులు ఉన్నకాటికి కట్టించుకోని వదిలేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేసి, సొంతింటి కలను నేరవేర్చాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయంటే..?

ధర్మవరం పట్టణ సమీపంలో ఉన్న పోతులనాగేపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి, గొల్లపల్లి వంక, గొట్లూరు గ్రామాల్లో ఇంటి పట్టాతో పాటు ఇళ్లనిర్మాణాలను మంజూరు చేశారు. కుణుతూరు వద్ద 100కు పైగా, గొల్లపల్లి వంక వద్ద 1351, పోతులనాగేపల్లి జగనన్న లేఅవుట్‌లో 4500, రేగాటిపల్లి పొలంలో 1000కి పైగా, గొట్లూరు వద్ద 100మందికి పైగా ఇంటిపట్టాతో పాటు ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక్కో ప్రాంతంలో కూడా సగానికి పైగా నిర్మాణాలు చేపట్టలేదు.

వసతుల కొరత

జగనన్న కాలనీలో వసతులు లేక లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనకడుగు వేస్తున్నారు. ప్రధానంగా కుణుతూరు, గొట్లూరు, గొల్లపల్లి, రేగాటిపల్లి సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్‌లలో సరైన వసతులు లేక పునాదులకే పరిమితవ య్యాయి. కాలనీల్లో ఎక్కడా కూడా నీటి వసతి కల్పించలేదు. తూతుమంత్రంగా ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి కాలనీల్లో దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో లబ్ధిదారులు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకోని కొంతవరకు ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో ఒక్కో ట్యాంకర్ ధర రూ.500నుంచి రూ.700వరకు ఉండటంతో లబ్ధిదారులు అంత ధర చెల్లించకలేక ఇల్లు కట్టుకోవడానికి ముందుకు రాలేదు. కాలనీల్లో సరైన సౌకర్యాలు కల్పించలేదని, నీటి వసతి తోపాటు విద్యుత్‌సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక, సిమెంట్ పక్కదారి..?

ఇళ్ల నిర్మాణాలకు అప్పట్లో ప్రభుత్వం ఇసుక, సిమెంట్‌ను సరఫరా చేసింది. అయితే వీటిని పేదలకు అందించకుండా కొంతమంది అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలి టీ అధికారులు, ఇంజనీర్ అసిస్టెంట్లు పేదలకు ఇవ్వాల్సిన ఇసుక కూపన్లు, సిమెంట్ బస్తాలను అమ్ముకున్నట్లు తెలుస్తోంది. సగం ఇళ్లకే పూర్తిస్థాయిలో ఇసుక, సిమెంట్ ఇచ్చినట్లు నమోదు చేసి మిగిలిన వాటిని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు ఆయా లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో అప్పటి సిమెంట్ లేదని ఇంకా ఈ ప్రభుత్వం మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో బిల్లులు అందిస్తాం

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తాం. గత పదేళ్ల నుంచి నిలిచిపోయిన ఇళ్లకు నిర్మాణాలు చేపట్టగానే విడతలవారీగా బిల్లులు లబ్ధిదారుల అకౌంట్‌లోకి జమ అవుతున్నాయి. బిల్లుల విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందకుండా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.

- శంకర్‌లాల్, హౌసింగ్ డీఈఈ, ధర్మవరం


గొల్లపల్లి వంక సమీపంలో జగనన్న కాలనీల్లో పునాదులకే పరిమితమైన ఇళ్లు

పింఛన్లకు రూ.124.86కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను జనవరి నెలకు సంబంధించి మంగళవారం గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయనున్నారు. జిల్లాలో 2,84,085మంది పింఛన్‌దారులకు రూ.124.86కోట్లు నిధులు మంజూరు చేశారు. వృద్ధులు 1,39,472మందికి రూ.56.10 కోట్లు, వితంతువులు 66,354మందికి రూ.26.77కోట్లు, చేనేతలు 6,588 మందికి రూ.2.64కోట్లు, కల్లుగీత కార్మికులు 351 మందికి రూ.14.2లక్షలు, మత్స్యకారులు 876మందికి రూ.35.లక్షలు, ఒంటరి మహిళలు 6,687మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మచారులు 3,464మందికి రూ.1.39కోట్లు, హిజ్రాలు 205మందికి రూ.84 వేలు, హెచ్‌ఐవీ బాధితులు 2,432 మందికి రూ.97లక్షలు, డప్పు కళాకారులు 3,089మందికి రూ.1.24కోట్లు, కళాకారులు 178మందికి రూ.72వేలు, దివ్యాంగులు 45,820మందికి రూ.27.63కోట్లు, కుష్ఠు బాధితులు 381మందికి రూ.22లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,425మందికి రూ.2,13కోట్లు, ప్రమాద బాధితులు 1074మందికి రూ.1.61కోట్లు, అభయహస్తం 4,186మందికి రూ.21లక్షలు మొత్తం 2,84,085మందికి రూ.124.86కోట్లు నిధులు విడుదల చేశారు. పింఛన్ సొమ్మును బ్యాంకుల నుంచి సిబ్బంది సోమవారమే డ్రా చేసుకున్నారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. మొదటి రోజే పింఛన్‌దారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తారని, సాంకేతిక కారణాలతో సమస్యలు వస్తే రెండో రోజు పూర్తి చేస్తారని తెలిపారు.

చీనీ టన్ను రూ. 27వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27,420 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 16 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.


టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 5, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

మల్లికార్జున్ మన్సూర్ (జయంతి)



హిందూస్తానీ శాస్త్రీయ సంగీత కారులు మల్లికార్జున్ మన్సూర్ 1910 డిసెంబరు 31న ధార్వాడలో జన్మించారు. జైపూర్ అత్రోలి ఘరానాలో ఖయాలి శైలిలో ఆలపించడంలో నిష్ణాతులు. హిజ్ మాస్టర్స్ వాయిస్ (హెచ్ఎంవీ) లో సంగీత దర్శకుడిగా, ఆలిండియా రేడియో ధార్వాడ స్టేషన్‌కు సంగీత సలహాదారుడిగా పనిచేశారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్న ఘనత ఆయనది. జీవితచరిత్రను 'నన్న రసయాత్రె' పేరిట రచించారు. 1992 సెప్టెంబరు 12న కన్ను మూశారు. కాగా ఆయన నివాసాన్ని మ్యూజియంగా తీర్చిదిద్దారు.

జగ్గయ్య (జయంతి)



కంచుకంఠం జగ్గయ్యగా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత కొంగర జగ్గయ్య 1926 డిసెంబరు 31న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. తెలుగు సినిమా, రంగస్థల నటుడు, రచయిత, పాత్రికేయుడు, ఆకాశవాణిలో తొలితరం తెలుగువార్తల చదువరి. నాటకాలు, సినిమాల ద్వారా ఆంధ్రులకు జగ్గయ్య సుపరిచితుడు. కళా వాచస్పతిగా పేరొందారు. ఉత్తమ నటుడిగా నంది పురస్కారం పొందారు. పార్లమెంటుకు ఎన్నికైన తొలి నటుడు. 'గీతాంజలి'తో పాటు పలుపద్యాలను అనువదించారు. 2004 మార్చి 5న కన్నుమూశారు.

కే రామలక్ష్మి (జయంతి)



కే రామలక్ష్మి 1930 డిసెంబరు 31న కాకినాడ జిల్లా కోట నందూరులో జన్మించారు. మద్రాసు యూనివర్శిటీలో బీఏ పట్టభద్రురాలు. 1951 నుంచి రచన చేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్రసాహిత్యంపై పట్టు కలిగి అనువాదాలు చేశారు. స్త్రీ సంక్షేమ సంస్థలలో పనిచేశారు. కవి, సాహితీ విమర్శకుడు ఆరుద్రతో వివాహం జరిగింది. 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరిట పలు రచనలు చేశారు. 'గృహలక్ష్మీ స్వర్ణకంకణం' పురస్కారం పొం దారు. 2023 మార్చి 23న కన్నుమూశారు.

ఆంటోనీ హాప్కిన్స్ (పుట్టినరోజు)



సర్ ఫిలిప్ ఆంటోనీ హాప్కిన్స్ 1937 డిసెంబరు 31న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. నటుడు, స్వరకర్త, దర్శకుడు, నిర్మాత. అకాడమీ అవార్డు, మూడు బాఫ్టా, రెండు ఎమ్మీ అవార్డులు అందుకున్నారు. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్' పురస్కారం పొందారు. ఉత్తమ నటుడు, 2003లో 100 గ్రేటెస్ట్ మూవీస్టార్స్‌లో 7వ వ్యక్తిగా నిలిచారు. బుల్లితెరపైనా రాణిస్తూ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'ది ఫాదర్' చిత్రంలో నటనకు 2021లో బెస్ట్ యాక్టర్‌గా ఆస్కార్ అవార్డును అందుకున్నారు.

ఆర్ నారాయణమూర్తి (పుట్టినరోజు)



నారాయణమూర్తి 1953 డిసెంబరు 31న తూర్పు గోదావరి జిల్లా మల్లంపేట గ్రామంలోని పేద రైతు కుటుంబంలో జన్మించారు. 'ఎర్ర సైన్యం', 'చీమలదండు' తదితర విప్లవ ప్రధానమైన సినిమాల నిర్మాత, నటుడు, హేతువాది. సమకాలీన సామాజిక సమస్యల ఇతివృత్తంతో తీసినవే. సినిమాలు, రాజకీయాలు, సామాజిక బాధ్యత అనే మూడు వ్యాసంగాలపై ఇష్టాన్ని ఏర్పరుచుకున్నారు. నిరుద్యోగం, ప్రపంచబ్యాంకు విధానాలు, తదితర అంశాలపై సినిమాలు తీశారు. ఆడంబరాలు లేని సాధారణ జీవితం గడుపుతున్నారు.

సాహిత్యాభిలాష పెరగాలి

● సీనియర్ సాహితీవేత్త జగన్నాథ్ బహుళె

దొమ్మసంద్ర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటితరంలో సాహిత్యాభిలాష పెరగాలని వక్తలు పేర్కొన్నారు. కన్నడ సాహిత్యలోకంలో డాక్టర్ జీఎస్ శివరుద్రప్ప మేరు పర్వతం లాంటివారని, సమన్వయ కవిగా పేరొందారని సీనియర్ సాహితీవేత్త జగన్నాథ్ బహుళె అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకా ముత్తానల్లూరు గ్రామంలో చిన్మయసేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చిన్నప్పై చిక్కహాగడె నేతృత్వంలో సోమవారం 'ఇంటింటా సాహిత్యం' అనే కార్యక్రమంలో జాతీయకవి కువెంపు, గాయకుడు అశ్వథ్ జయంతిని, శివరుద్రప్ప గీతాగాయనం ప్రారంభించి మాట్లాడారు. శివరుద్రప్ప తమ సుమధురమైన గీతాలతో ప్రజలకు చేరువయ్యారన్నారు. కువెంపు సాహిత్యం నేటికీ అలరారుతోందన్నారు. సంగీత దర్శకుడు, గాయకుడు అశ్వథ్ పాటలు ఎంతో పేరొందాయన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలు లేకుండా శివరుద్రప్ప సాహిత్యంలో రాణించారన్నారు. జేనుగూడు సాహిత్యవేదిక సంస్థాపకుడు కవి మహేశ్, జాతీయ యువ పురస్కార గ్రహీత నాగవేణి తదితరులు ప్రసంగిస్తూ నేటి యువతకు సాహిత్యంపై అభిలాష పెంచే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆనేకల్ రాజేశ్, గోవిందరాజులు ఆలపించిన జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సత్సంగ సమాజం ముఖ్యులు రాధమ్మ, నాగరాజరెడ్డి, ముత్తనల్లూరు గ్రామపంచాయతీ సభ్యురాలు మంజుళ రమేశ్‌రెడ్డి, జైభీమ్ జనజాగృతి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అత్తిబెలె రవి, పంచాయతీ మాజీ అధ్యక్షురాలు సుజాత చిన్నప్ప, నాటకరంగ కళాకారుడు రమేశ్, బాల్డ్‌విన్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.



సాహిత్య సమావేశం ప్రారంభంలో ప్రముఖులు

ఆధ్యాత్మిక మార్గంలోనే విజ్ఞానం

» విజ్ఞానజ్యోతి పుస్తకావిష్కరణలో డాక్టర్ ఉమర్ అలీషా



పుస్తకావిష్కరణలో డాక్టర్ ఉమర్ అలీషా తదితరులు

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక మార్గంతో విజ్ఞానాన్ని సాధించవచ్చునని విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి ఉమర్ అలీషా అన్నారు. ఆయన రచించిన విజ్ఞానజ్యోతి కన్నడ అనువాద పుస్తకావిష్కరణ ఆదివారం శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో జరిగింది. విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం తెలుగు విజ్ఞాన సమితి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉమర్ అలీషా మాట్లాడుతూ సమాజంలో ఎన్నో సమస్యలు నిత్య జీవన విధానంలో పరిష్కరించుకునేందుకు మార్గంగా విజ్ఞానజ్యోతి రచించామన్నారు. అరిషడ్వర్గాలను జయించినప్పుడు మనిషి ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఆధ్యాత్మిక తత్వాన్ని అలవరచుకోవాలని హితవు పలికారు. ముఖ్యులుగా పాల్గొన్న పద్మభూషణ్ డాక్టర్ చంద్రశేఖర కంబార మాట్లాడుతూ కన్నడ, తెలుగుభాషలు సోదరభావంతో శతాబ్దాలుగా ఉన్నాయన్నారు. తెలుగు సంస్కృతి కన్నడలో భాగంగా మారిందన్నారు. పుస్తక రచయిత జొన్నవిత్తుల రామచంద్రమూర్తి పుస్తకంలోని పలు అంశాలను ప్రస్తావించారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు అధ్యక్షత వహించగా సామాజిక సేవా కార్యకర్తలు ధనంజయ రామ కృష్ణప్ప, నగేశ్, ఫౌండేషన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంజునాథరెడ్డి, సమితి కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి, సమితి సభ్యులు గంగరాజు, వరదరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాటరాయణస్వామి రథోత్సవం

బంగారపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని డి.కె.హళ్ళి గ్రామ పంచాయతీలో బ్యాటరాయణస్వామి జాతరలో భాగంగా రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామపంచాయతీ అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ జాతరలో భాగంగా కులమతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొన్నారన్నారు. ధార్మిక సంస్కృతిని కాపాడుకునేందుకు జాతరలు దోహదపడతాయన్నారు. స్వామివారికి విశేషపూజల అనంతరం ఉత్సవమూర్తిని అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, ఇతర కళా బృందాలు పాల్గొన్నాయి. ఎస్సై రాజణ్ణ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రథోత్సవంలో భాగంగా పలురకాల తినుబండారాల దుకాణాలు వెలిశాయి. ఎంపీ మల్లేశ్‌బాబు, జడ్పీ మాజీ సభ్యుడు బీవీ మహేశ్, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు మునిరాజు, గ్రామపంచాయతీ సభ్యురాలు సవితాబాబు, కేహెచ్ మునియప్ప, గ్రేడ్ 2 తహసీల్దార్ గాయత్రి, ఉపతహసీల్దార్ ప్రభాకర్, పీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

» నటుడు ప్రకాశ్‌రాజ్



సమావేశంలో ప్రసంగిస్తున్న నటుడు ప్రకాశ్‌రాజ్

విజయపుర, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకాలో చన్నరాయపట్టణ హోబళిలో 13గ్రామాల రైతులు చేపట్టిన భూస్వాధీన వ్యతిరేక పోరాటానికి వెయ్యి రోజులు చేరిన నేపథ్యంలో సోమవారం భారీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ తాను రైతు కాదని అయినా కొన్ని మొక్కలు పెంచానన్నారు. రైతుల రుణం తీర్చుకోవడానికి ఈ కార్యక్రమానికి విచ్చేశానన్నారు. రైతులు వెయ్యి రోజులుగా పోరాటం చేస్తున్నారంటే అది సామాన్య విషయం కాదన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అనే మాట మాటలకే పరిమితమవుతోందని విచారం వ్యక్తం చేశారు. రైతులు వెయ్యిరోజులుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వాలు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ప్రజల, రైతుల వ్యతిరేకిగా మారాయన్నారు. ప్రస్తుత కేంద్రప్రభుత్వం పంజాబ్, హర్యానాలలో రైతు వ్యతిరేకంగా వ్యవహరించిందన్నారు. పోరాటం ప్రారంభమైన వేళ అస్తిత్వంలోని ప్రభుత్వం 'వీరు రైతులే' కాదని పేర్కొన్నా రన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా రైతుల సమస్యలను పట్టించుకో లేదన్నారు. ఇది కేవలం 23 గ్రామాల భూస్వాధీన సమస్య కాదన్నారు. పోరాటంలో విజయం సాధించడం ద్వారా స్వాధీన ప్రక్రియ విధానాన్నే మార్చవచ్చు నన్నారు. స్వాధీనం చేసుకునే భూమి పెట్టుబడి దారులకు ఇస్తారని, వారు చెట్టు చూడకుండానే కాయ కోస్తారని, మొక్క చూడకుండా పూలు సమర్పిస్తారని, వరిపైరు చూడకుండా బియ్యం వండుతారని, రాగిని చూడకుండానే ముద్ద ఆస్వాదిస్తారని తద్వారా వారికి భూమి, రైతుకు ఉన్న సంబంధం అర్థం కాదన్నారు. భూమి అనేది రైతు స్వాభిమానం, గుర్తింపు, వారి గర్వకారణ మన్నారు. దాన్ని బలవతంగా లాగేసుకోవాలను కోవడం సరికాదన్నారు. తరతరాలుగా కొనసాగిస్తున్న భూములను వదులుకునేందుకు రైతులు సిద్ధంగా లేరని అయినా సారవంతమైన భూమిని పరిశ్రమలకు ఇవ్వాల్సిన అవసరం ఏం ఉందన్నారు. గతంతో పోలిస్తే సాగు చేసేవారు తగ్గారని ఉన్న రైతులనుంచి కూడా భూములు లాగేసుకుంటే భవిష్యత్తులో ఏం తిని బతుకుతారని ప్రశ్నించారు. రైతులు నశిస్తే మనం ఉండమనేది గుర్తించాలన్నారు. ఈ విషయాన్ని మీడియా కూడా అర్థం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు. ప్రొఫెసర్ ఎస్‌జి సిద్దరామయ్య తాను రైతు బిడ్డనని చెప్పుకోవడానికి గర్వపడతానన్నారు. రాజకీయాలు వీడి పాలకులు సైతం రైతుల సమస్యలను అర్థం చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డు జస్టిస్ గోపాలగౌడ, చుక్కినంజుండస్వామి తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

5న పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో నృత్యోత్సవం


బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో జనవరి 5న 44వ వార్షిక నృత్యోత్సవం జరుపు తున్నారు. వయ్యాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో నృత్యోత్సవం ఉంటుందని కళానికేతన్ వ్యవస్థాపక కార్యదర్శి వేణుగోపాల్ ప్రకటించారు. సాయంత్రం 6 గంటలకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఉంటాయన్నారు. ఏటా పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

9 నుంచి సంక్రాంతికి ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రయాణీకుల కోసం అదనంగా 70 సర్వీసులను నడపనున్నట్లు ఏటీఎం రవీంద్రరెడ్డి తెలిపారు. జనవరి 9 నుంచి 12వ తేదీ వరకు సర్వీసులు కొనసాగుతాయన్నారు. సాధారణ సర్వీసులతో సంబంధం లేకుండా అదనపు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండుగను మూడు రోజులపాటు సంబరంగా జరుపుకొనే సంప్రదాయం ఉందన్నారు. సొంతూళ్లకు వెళ్లదలచుకున్నవారికి ప్రయాణంలో ఇబ్బంది ఉండరాదనే తగిన సర్వీసులు సమకూర్చామన్నారు. సాధారణ చార్జీలతోనే అదనపు సర్వీసులలో ప్రయాణం చేయవచ్చునన్నారు. ఇందుకు ప్రత్యేక రిజర్వేషన్ సౌలభ్యం కూడా ఉందన్నారు. విజయవాడ, ప్రొద్దటూరు, గుంటూరు, కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి తదితర ప్రధాన పట్టణాలు, నగరాలకు అదనపు సర్వీసులు ఉంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెట్‌వర్క్ విస్తరిస్తేనే వ్యాపారాభివృద్ధి

బెంగళూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఏ విభాగానికి చెందిన వ్యాపారమైనా నెట్‌వర్క్ విస్తరిస్తేనే అభివృద్ధి సాధ్యమని సామాజిక కార్యకర్త మహేంద్ర మున్నోత్ అభిప్రాయపడ్డారు. సోమవారం శిక్షకర భవన్‌లో నెట్‌వర్క్ డేను పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం జరిగింది. నగర పరిధిలోని 500మందికిపైగా నెట్‌వర్క్ మార్కెటింగ్ నిపుణులు పాల్గొన్నారు. మహేంద్ర మున్నోత్ మాట్లాడుతూ నెట్‌వర్క్ మార్కెటింగ్ వృత్తిపరులంతా సమైక్యంగా పనిచేయాలని సూచించారు. తద్వారా బ్లాక్‌మార్కెట్ ఇతర త్రా సమస్యలు అరికట్టవచ్చునన్నారు. రైతు దినోత్సవాన్ని నెట్‌వర్క్ డేగా కూడా భావిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కుమార్, న్యాయవాది హర్ష ముతాలిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.22	1,589.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	453	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,895	779
నీటి నిల్వ (టీఎంసీలు)	83.99	10.48

అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు బ్రేక్..!

● కేంద్రం ప్రకటించిన జాబితాలో కొప్పళ పేరు లేదు ● స్థల సేకరణ మాత్రమే పూర్తయ్యింది : కలెక్టర్



కొప్పళ జిల్లా అధికారి నలిని అతుల్

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అణు విద్యుత్ కేంద్రం స్థాపనకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాత్కాలింగా బ్రేక్ వేసినట్లు తెలుస్తోందని, అయితే కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన 1200 ఎకరాల భూమిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడమే తమ బాధ్యతని కొప్పళ జిల్లా జిల్లా కలెక్టరు నలిని అతుల్ ప్రకటించారు. కర్ణాటకలో ఇప్పటికిప్పుడు కొత్తగా అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఇటీవల లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇదే ఏడాది జులై 24వ తేదీన లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం సూచనలో భాగంగా దేశ పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుని ఉత్తర కన్న జిల్లాల పరిధిలో అణు విద్యుత్ కేంద్రం స్థాపనకు ప్రస్తావన ఇప్పట్లో లేదని స్పష్టంగా తెలుస్తోందన్నారు. కొప్పళ తాలూకా అరసకేరి, గంగావతి తాలూకాల్లో హిరేబెణకల్ భాగాల్లో ఆయా తహసీలార్లు భూమిని వెతికే పనిలో ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం అణువిద్యుత్ కేంద్రం స్థాపనలో మనసు మార్చుకున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు మనసు తాత్కాలికంగా కుదటపడినా అణు విద్యుత్ కేంద్ర ప్రస్తావన ఎపుడైనా తెరపైకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల జిల్లాధికారులకు భూమి గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో సూచించింది. భూమి సేకరణకు సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు పంపాలని సూచింది. ఈ నేపథ్యంలోనే పరిసర సామాజిక మార్పుల విషయానికి సంబంధించి భూ వైజ్ఞానిక అధ్యయనాలు ప్రారంభించారు. అణు విద్యుత్ కేంద్రం స్థాపన మాట ఎలా ఉన్నా... విద్యుత్ కేంద్రం నిర్మిస్తే నిత్యం అధిక ప్రమాణంలో నీరు కావాల్సి వస్తుందని, అంత ప్రమాణంలో ప్రకృతి నీటి సంపద కొప్పళ జిల్లాలో లభ్యత లేదని విజ్ఞానులు పేర్కొంటున్నారు. జిల్లాకు ప్రముఖ జలవనరులైన తుంగభద్ర జలాశయం నది అందుబాటులో ఉన్నా... సంవత్సరం పాటు నదిలో నీటి లభ్యత ఉండదు. కేంద్రం స్థాపనతో పాటు అణు ఇందన రవాణా, వికిరణ వస్తువుల తొలగింపు ఇలా అనేకమైన సవాళ్ళు ఎదుర్కోవాల్సి ఉంటుందని, భారత దేశంలో కార్యనిర్వహణ చేస్తున్న నిర్మాణ దశలో ఉన్న 20 అణువిద్యుత్ కేంద్రాలు మినహా, కేంద్ర ప్రభుత్వం 2038వరకు అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి దేశ వ్యాప్తంగా 28 ప్రాంతాలను గుర్తించింది. అందులో కర్ణాటక రాష్ట్రంలో ప్రాంతాలు లేకపోవడం విశేషం. ఇదే విషయంపై జిల్లా అధికారి కొప్పళ జిల్లా ప్రజలకు అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు విషయంపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, కేంద్ర సూచనల మేరకు అవసరమైన భూమిని వెతికి అందజేయడమే తమబాధ్యత అని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలో ఉందని, దేశవ్యాప్తంగా కొత్తగా అణు విద్యుత్ కేంద్రాల స్థాపనకు అవసరమైన భూమిని సేకరించే ప్రయత్నం జరుగుతోందని, అందులో కొప్ప జిల్లా ఒకటని పేర్కొంటున్నారు. ఇప్పటికప్పుడు అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు సాధ్యం కాదని, జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ప్రజలకు సూచిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేడీఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాయణ్ణ

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

● చౌకధాన్యం అక్రమ రవాణాలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి: జేడీఎస్ డిమాండ్

బళ్లారి సిటీ, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కురుగోడు తాలూకా మదిరే క్రాస్ సమీపంలో అక్రమంగా బియ్యం రవాణా చేస్తూ వాహనం బోల్తా పడి ఇద్దరు మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని జేడీఎస్ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని జేడీఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. బియ్యం అక్రమ రవాణాలోనే కుంటి మంజు, బళ్లారి నగరానికి చెందిన శరబయ్య హత్యకు గురయ్యారన్నారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి ప్రభావంతో కేసు విచారణలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈనేరానికి పాల్పడిన వారిపై పలు కేసులు ఉన్నాయి. ఆహార శాఖ అధికారులు, పోలీసులు నిందితులకు సహకరిస్తున్నారు. ఆహార శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున సహకారంతో కురుగోడులో రేషన్ అక్రమ రవాణా సాగుతోందని, విచారణను లోకాయుక్తకు అప్పగించాలన్నారు. పేదలకు అందించిన బియ్యాన్ని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అలాంటి వారి రేషన్ కార్డు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బియ్యం బదులు మినుము, మొక్కజొన్న, శెనగలు, వంటనూనె సరఫరా చేయాలన్నారు. జిల్లాలో పాలన వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, అభివృద్ధి శూన్యమన్నారు. ఈ ప్రభుత్వంలో ఏమి అడిగినా డబ్బులు లేవంటారని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో లక్ష్మీకాంతరెడ్డి, విజయ్‌కుమార్, హొన్నూరుస్వామి, రామాంజనేయులు, జావేద్, హొన్నూరువలీ, నాగరాజ్, చాగనూరు నాగరాజు, జమీలా, షబానా, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





అలంకరణలో ఎర్రితాత కుమారస్వామి

ఆలయాల్లో అమావాస్య పూజలు

బళ్లారిరూరల్/సిరుగుప్ప/కంప్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంతో పాటు వివిధ ఆలయాల్లో సోమవారం అమావాస్య ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వెలిసిన చేళగుర్కి ఎర్రితాత దర్శనానికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకం పూల అలంకరణ నిర్వహించారు. ఇరు రాష్ట్రాల భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మోకా మల్లేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. బళ్లారి కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బళ్లారి ఫైర్ ఆఫీసు సమీపంలో ఉన్న కుమారస్వామి ఆలయంలో కుమారస్వామి దర్శనానికి భక్తులు విశేషంగా విచ్చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. సిరుగుప్ప, కంప్లి ఆలయాల్లో అమావాస్య పూజలు నిర్వహించారు.



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవి





కనకదుర్గమ్మ తాయమ్మదేవి

రేపు భీమా కోరేగావ్ విజయోత్సవం



మాట్లాడుతున్న కొడ్లి మల్లికార్జున

సిరుగుప్ప, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భీమా కోరేగావ్ విజయోత్సవ కార్యక్రమాన్ని జనవరి 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంఘం తాలుకా అధ్యక్షుడు కొడ్లి మల్లికార్జున తెలిపారు. సోమవారం సిరుగుప్ప ఎస్టీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీమా కొరంగావ్ విజయోత్సవానికి పెద్ద చరిత్ర ఉందని, సిద్ధనాయకుని సైన్యం కేసరి వంశస్తులను హతమార్చిన పోరాటం సందర్భంగా ఈ విజయోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా హైస్కూలు మైదానం నుంచి అండేడ్కర్ సర్కిల్ వరకు ఊరేగింపు చేపడ్తామన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు చిక్కబళ్లారి నాగేంద్ర, దేవేంద్ర, గోపాల్, ఆనంద, సుదర్శన్, కళ్యాణ, సిద్దార్థ, వీరేష, లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షల్లో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్యులు గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, సహజ ప్రసవానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. నగరంలోని జిల్లాకమిషనర్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మాత శిశు మరణాల నివారణపై సమన్వయ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రక్తహీనత ముందుగానే నియంత్రించడానికి గర్భిణులు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. తద్వారా సహజ ప్రసవాలతో తల్లీ బిడ్డలు సంతోషంగా ఇంటికి చేరుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులు గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి నిత్యం వైద్యులను సంప్రదించాలన్నారు. మొదటి కాన్పు సమయంలో వైద్యుల సలహామేరకు ఎప్పటికప్పుడు స్కానింగ్, రక్తపరీక్ష, మూత్ర పరీక్ష, హెచ్‌ఐవీ తదితర పరీక్షలు చేయించాలన్నారు. అన్ని వివరాలను మదర్ కార్డులో నమోదు చేయాలని, పరీక్షల కోసం ఏదైనా ఆసుపత్రికి వెళ్ళినప్పుడు మదర్ కార్డు ఆధారంగా చికిత్స అందించాలన్నారు. జిల్లాలోని అన్ని రోగ్య కేంద్రాల్లో నీటి నిల్వను పరీక్షించాలి. సరైన కార్యచరణ ప్రణాళికతో పౌష్టికాహారం అందించాలని సూచించారు.

జిల్లా ఆరోగ్య కుంటుంబ సంక్షేమశాఖ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ గర్భిణీ రెండవ త్రైమాసికం ప్రారంభమైన తర్వాత ఆల్బెండజోల్ మాత్ర ఒకటి, ఐరన్‌మాత్రలు, సుక్రోజ్ ఇంజక్షన్లు వేస్తామన్నారు. ప్రతినెలా 9, 20 తేదీల్లో వైద్యుల చెకప్‌తోపాటు గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్‌శరణప్ప, బిమ్స్ డైరెక్టర్‌గంగాధరగౌడ్, జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి,జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, బిమ్స్ నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీకాంత, తాలూకా ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు సమావేశంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం సాధ్యం

● కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప



నిష్ఠిరుద్రప్పను సన్మానిస్తున్న కన్నడ అభిమానులు

బళ్లారి సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):నగరంలోని కన్నడ చైతన్య వేదిక నుండి 88వ అఖిల భారత కన్నడసాహిత్య సమ్మేళనాన్ని బళ్లారి జిల్లాకు తీసుకురావడంలో విజయం సాధించిన కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్పను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో నిష్ఠిరుద్రప్ప మాట్లాడుతూ జిల్లాలో తదుపరి సాహిత్య సదస్సు నిర్వహించేందుకు అన్ని విధాల సహకారం అవసరమన్నారు. సమష్టి కృషితోనే విజయం సాధ్యమన్నారు. బళ్లారిలోని కన్నడిగులు వలంటీర్లుగా పని చేయడానికి స్వచ్ఛందంగా కదలిరావాలన్నారు. కులం, మతం, పార్టీ విభేదాలు మరిచి కన్నడ తల్లి భువనేశ్వరి జాతరను నిర్వహించాలన్నారు. వేదిక మహిళా అధ్యక్షురాలు జ్యోతిప్రకాష్, ప్రభుకుమార్, కన్నడసాహిత్య పరిషత్ అజయ్‌బంకర్, తిప్పేరుద్రప్ప,శివలింగప్ప అంద్యాల, హనుమంతప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

మహిళా రైతు ఆత్మహత్య

రాయచూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మాన్వి తాలూకా జానేకల్ గ్రామానికి చెందిన మహిళా రైతు యల్లమ్మ(45) ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబానికి ఆరు ఎకరాల పొలం ఉంది. గత ఏడాది వర్షభావ పరిస్థితికి తోడు, ఈ ఏడాది కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు సక్రమంగా చేతికి అందలేదు. సాగు కోసం చేసిన రుణాలు తీర్చే దారి కానరాక ఆందోళనతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండు రోజుల క్రితం యల్లమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమెను చికిత్స కోసం కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనకు సంబంధించి మాన్వి పోలీసులు కేసు నమోదు చేశారు. పంటసాగు కోసం సిండికేట్ బ్యాంక్‌తో పాటు ఇతర ప్రైవేటు అప్పులు చేసిన కుటుంబానికి పంటలు సరిగ్గా చేతికి అందకపోవడంతో రుణభారం అధికం కావడంతో ఆందోళన చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఎకరాకు 20క్వింటాళ్లు కొనుగోలు చేయాలి

● మద్దతు ధర పెంచాలని జొన్న రైతుల డిమాండ్



ఏడీసీ జుబేరాకు వినతి పత్రం అందజేస్తున్న కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం పదాధికారులు

బళ్లారి గాంధీనగర్/రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్రింద రైతుల నుంచి ఎకరాకు 20క్వింటాళ్ళ జొన్నను కొనుగోలు చేసేలా ఆదేశాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తూ నగరంలో సోమవారం ఆందోళన చేపట్టింది. ఈ ఆందోళనలో వందలాది మంది రైతులు పాల్గొన్నారు. రైతు డిమాండ్లు పరిష్కరించాని కోరుతూ జిల్లాధికారి కార్యాలయం చేరుకుని ముఖ్యమంత్రికి రాసిన లేఖను జిల్లా సహాయాధికారి జుబేరాకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాధవ రెడ్డి మాట్లాడుతూ, పొరుగు జిల్లా రాయచూరు తాలూకా పరిధిలోని ఫిర్కా స్థాయిలో నమోదు చేసుకున్న అన్ని సహకార సంఘాల్లో రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరలో అమ్ముకోవడానికి నమోదు చేసుకునేందుకు అదనంగా నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో కేవలం 8 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో పాటు బళ్లారి వ్యవసాయ మార్కెట్ సమితి పరిధిలోకి వచ్చే అలదళ్ళి గ్రామంలో ఉన్న 23.25 ఎకరా ప్రాంతాల్లో మిరప మార్కెట్‌ను ఏర్పాటుకు స్థలం కేటాయించి మూడు సంవత్సరాలు గడిచినా ఇంతవరకు దాని ప్రస్తావన లేదన్నారు. ఇదే విషయంపై బెళగామ్ సీతాకాలం సమావేశాల్లో మిర్చి మార్కెట్ స్థాపనకు ఆర్థిక శాఖ నుండి అనుమతి రాలేదని మంత్రి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సంఘం పదాధికారులు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

9న విజయనగరం జిల్లా బంద్

● రాజ్యాంగ పరిరక్షణ సమితి పిలుపు



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బళ్లారి సిటీ,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అవమానకర వ్యాఖ్యలకు నిరసనగా జనవరి 9న విజయనగరం జిల్లా బంద్‌కు రాజ్యాంగ పరిరక్షణ సమితి పిలుపునిచ్చింది. సోమవారం హొసపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు సంఘాల నాయకులు మాట్లాడారు. దాదాపు అన్ని సంస్థలు బంద్‌కు మద్దతు తెలిపాయి. ఈ పోరాటానికి అంజుమన్ కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని కమిటీ అధ్యక్షుడు నిమ్మగల్ రామకృష్ణ, యల్లలింగ, పెద్దబసప్ప, రామచంద్రబాబు, రవికుమార్, నూర్ అహ్మద్, వ్యవసాయ కార్మిక, భవన నిర్మాణ కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొంటాయన్నారు.ఈసందర్భంగా వివిధ సంఘాల నాయకులు డి.వెంకటరమణ, వెంకటేశ్, రమేశ్, దేవరమనె కన్నేశ్వర్, శివకుమార్, కుబేరా దళాలి తదితరులు ఉన్నారు.

హొసూరు జోన్

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హొసూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనలో లైంగిక వేధింపుల ఘటనలు పెరిగాయని ఆరోపిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అన్నా యూనివర్సిటీ విద్యార్థిని అంశాన్ని ఖండించారు. నిరసనకు మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ప్రతి అంశంలోనూ డీఎంకే సమస్యలు సృష్టిస్తోందని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ధర్నాలో అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక ప్రైవేట్ కల్యాణమండపానికి తరలించి సాయంత్రం విడుదల చేశారు. ధర్నాలో ఎమ్మెల్యే కేపీ మునుస్వామి, నాయకులు మదనసెల్వి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి

హొసూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కీర్తనల ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చిన కనకదాసు 537వ జయంతిని ఘనంగా నిర్వహించారు. డెంకణీకోటలో కనకదాస సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తొలుత కుంబార సామాజికవర్గ ప్రజలు తమ ఆరాధ్యదైవమైన సిక్కమ్మ శివలింగేశ్వరిదేవి, తోటమ్మ, జగతీశ్వరి దేవి, లింగేశ్వరస్వామి, సిక్క వీరమ్మదేవి, బీరేశ్వరస్వామి తదితర గ్రామదేవతలను ఊరేగించారు. డొళ్ళుకుణిత, వీరగాసె, వీరభద్ర కుణిత, కంసాలె తదితర సాంస్కృతిక కళాబృందాలు పాల్గొన్నాయి. తలపై కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



తలపై కొబ్బరి కాయలు కొట్టించుకుంటున్న భక్తులు

కంప్లి బంద్ ప్రశాంతం



ప్రయాణికులు లేక ఖాళీగా బస్టాండు

కంప్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజాసంఘాలు పిలుపు మేరకు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో కంప్లి బంద్ చేపట్టాయి. ఉదయం ఉద్భవగణపతి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు అమిత్‌షాకు విరుద్ధంగా డాక్టర్ అంబేద్కర్ భావ చిత్ర పటాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొని బంద్‌కు మద్దతు పలికారు. అనంతరం ప్రధాని, రాష్ట్రపతికి రాసిన లేఖను తహసీల్దార్ శివరాజ్‌కు అందజేశారు. బంద్ సందర్భంగా దుకాణాలు మూసివేశారు. కుమారస్వామి, లక్ష్మణ్ణ, బివి గౌడ, కొట్టూరు రమేష్, మల్లికార్జున, బసవరాజు, నారాయణప్ప, షణ్ముఖప్ప, బట్టప్రసాద్, వీరాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విమానయానానికి విద్యార్థులు



జిందాల్ ఎయిర్ పోర్టులో ప్యాటి గ్రామం విద్యార్థులు

గంగావతి రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విమాన ప్రయాణానికి సోమవారం ప్యాటి గ్రామ విద్యార్థులు బయల్దేరారు. కొప్పళ తాలూకా ప్యాటి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 35 మందికి విమాన ప్రయాణ అవకాశం దక్కింది. విద్యార్థులు, ఎస్‌డీఎంసీ సభ్యులు, స్థానిక సంస్థల సహకారంతో ప్రభుత్వం విద్యార్థులకు ప్రయాణ భాగ్యం లభించింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు లభించడం జిల్లాలో రెండో పాఠశాలగా గుర్తింపు పొందింది. జిందాల్ ఎయిర్ పోర్టుకు వెళ్ళి అక్కడి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం అయ్యారు. హైదరాబాద్‌లో హుసేన్ సాగర్, గోల్కొండ కోట, మ్యూజియం లాంటి చారిత్రక కట్టడాలను సందర్శించనున్నారు.

రక్తదాతలకు ఎమ్మెల్యే అభినందనలు

కంప్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల్లోకి రక్తదానం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. సోమవారం పాత నెల్లూడిలో హజరత్ ఖాసిమ్ సాహెబ్ 93వ సంవత్సరం ఉరుసు సందర్భంగా ఎమ్మిగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ గోపి బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎందరో యువకులు రక్తదానం చేశారు. వారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. సుమారు 62 మందికి పైగా రక్తదానం చేశారు. అలాగే దర్గాలో గత రెండు రోజుల నుంచి హజరత్ ఖాసీమ్‌వలీ దర్గా వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు నుంచి భక్తులు భారీఎత్తున పాల్గొన్నారు. మహమ్మద్ ఫరూక్, బసవరాజు, విగ్నేష్, మంజునాథ, ఎన్‌కే నంద, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

తొలి జ్ఞానపీఠ్ సాధించిన కువెంపు

● కన్నడ భాషకు ప్రాధాన్యం పెంచిన కవి: రవి చెళ్లగుర్కి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజోతి): కన్నడ భాషకు తొలి జ్ఞానపీఠ అవార్డు శ్రీ రామాయణ దర్శనం రచించిన రాష్ట్ర కవి కువెంపుకు దక్కిందని కర్ణాటక రాష్ట్ర యాక్షన్ టీచర్స్ వేదిక బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. సోమవారం నగరంలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో కువెంపు 120వ జయంతి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కువెంపు మైసూరు విశ్వవిద్యాలయం మానస గంగోత్రి వైస్‌చాన్స్‌లర్‌గా పనిచేశారన్నారు. 7వ తరగతిలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, రామాంజనేయ,గురుప్రసాద్, విజయ్‌ముంద్రగి, విద్యార్థి ప్రతినిధి అనూష,రోజా విజయలక్ష్మి, నిత్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి సత్కారం

బళ్లారి సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో బళ్లారి నగరానికి చెందిన కళాకారుడు రచయిత నాగభూషణ్‌కు జ్ఞాపిక, ప్రశంస పత్రం అందజేసి సత్కరించారు. మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ యువకులు సాహిత్య, సాంస్కృతిక, భాషాభివృద్ధికి కృషి చేయడం హర్షణీయమన్నారు. నాగభూషణ్‌ను సీనియర్ కళాకారులు జీఆర్.వెంకటేశులు, రామాంజనేయులు, సురేంద్రబాబు, రామచంద్ర తదితరులు అభినందించారు.



నాగభూషణ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్